క్లుప్తంగా

విద్యార్థులకు రాగిజావ పంపిణీ



విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న జెడ్పీటీసీ జ్యోతి, ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జెడ్పీటీసీ ఒడుగుల జ్యోతి , ప్రజాప్రతినిధులు గురువారం రాగిజావ అందజేశారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ జగనన్న గోరు ముద్ద పథకంలో రాగిజావ కూడా చేరడంతో విద్యార్థులకు మరింత బలవర్ధమైన ఆహారం అందుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ మురళీకృష్ణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు తాతారావు, నాయకులు ఎస్.రవి, ఎ.రవి, హెచ్ఎం త్రిమూర్తులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా కుమార్ బాధ్యతల స్వీకరణ



అనంతగిరి: మండలంలోని ఎంపీడీవో ఎ.వి.వి. కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో శ్రీహర్షిత్ సెలవు పై వెళ్లడంతో విశాఖపట్నం జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న ఎ.వి.వి.కుమార్ అనంతగిరి ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించా రు. ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు కలిశారు. అనంతరం పాడేరులో కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవోను గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.

మెరుగైన బోధన అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు

దుంబ్రిగుడ: మండలంలోని కేజీబీవీ, పంతలి చింత, అంత్రిగుడ ఎంఈవో ఎస్.రామచంద్రరావు గురువారం తనిఖీ చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. పబ్లిక్ పరీక్షలపై ఆందోళన చెందవద్దన్నారు. ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. పాఠశాల ప్రత్యేకాధికారి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



శోభ అర్జున్ (ఫైల్)

దుంబ్రిగుడ: మండలంలోని తూటంగి పంచాయతీ దాతురు మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న శోభ అర్జున్(46) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. హుకుంపేట మండలం మండపుట్టు గ్రామానికి చెందిన అర్జున్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతికి పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

బాలికల హక్కులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో రమ్య

చింతపల్లిరూరల్: లంబసింగి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో గురువారం బేటీ బచావో.. బేటీ పడావో, పోషణ్ పక్వాడా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐసీడీఎస్ సీడీపీవో జి.రమ్య మాట్లాడుతూ బాలికల ప్రాథమిక హక్కులు పరిరక్షించుకోవాలన్నారు. బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలను నియంత్రించాలన్నారు. హెచ్ఎం బీఎస్ఎస్ పడాల్, డిప్యూటీ వార్డెన్ గోల్డ్, సూపర్‌వైజర్లు గౌహర్ ఉన్నీష్‌భేగం, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

రాజవొమ్మంగి: వాతంగి పంచాయతీ, బట్టావారివీధి సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా బట్టీపై జడ్డంగి పోలీసులు గురువారం దాడి చేసి సామగ్రి ధ్వంసం చేశారు. 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ షరీఫ్ తెలిపారు. బట్టీ నిర్వాహకుని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నామన్నారు. నిందితుని అడ్డతీగల జేఎఫ్ఎం కోర్టులో హాజరుపరిచినట్టు చెప్పారు.

తీరిన వెతలు

- త్వరలో పెట్రోల్ బంకు ప్రారంభోత్సవం
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



లుంగాపుట్టు వద్ద ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న పెట్రోల్ బంకు

ముంచంగిపుట్టు: మండల వాసులకు ఎన్నో ఏళ్ల తర్వాత పెట్రోల్ బంకు కష్టాలు తీరనున్నాయి. మండలంలో గల వనభసింగి పంచాయతీ లుంగాపుట్టు గ్రామ సమీపంలో నూతన పెట్రోల్ బంకు అన్ని పనులు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవం కావడానికి సిద్ధంగా ఉంది. దీంతో మండల వాహనదారులకు పెట్రోల్ బంకు అందుబాటులోకి రానున్నది. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీలకు చెందిన 372 గ్రామాలకు వందల సంఖ్యల్లో జీపులు, ఆటోలు, బైకులు, వ్యాన్లు, ట్రాక్టర్లు, కార్లు ఉన్నాయి. వీటికి పెట్రోల్, డీజిల్ వేయాలంటే 18 కిలోమీటర్లు దూరంలో ఉన్న పెదబయలు వెళ్లాల్సిందే. దీంతో రెండు వైపులా 36 కిలోమీటర్లు ప్రయాణిస్తేనే కాని పెట్రోల్, డీజిల్ వేసుకొలేని పరిస్థితి. ఇప్పటికైనా పలుమార్లు పెట్రోల్ బంకు మంజూరైన స్థల సమస్యతో బంకు నిర్మాణానికి ఆటంకాలు ఎదురయ్యాయి. 2016 సంవత్సరం ముంచంగిపుట్టు మండల కేంద్రంలో హెచ్‌పీసీఎల్ బంకు మంజూరైంది. రెవెన్యూ అధికారులు మండల కేంద్రంలో మూడు స్థలాలను చూపించారు. కానీ విద్యుత్ స్తంభాల సమస్యతో పెట్రోల్ బంకు నిర్మాణానికి కార్యరూపం దాల్చలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మళ్లీ పెట్రోల్ బంకు ఏర్పాటుకు కదలిక మొదలైంది. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర బంకు నిర్మాణానికి ప్రత్యేక దృష్టి సారించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ద్వారా రూ.80 లక్షలతో హెచ్‌పీసీల్ పెట్రోల్ బంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. దీంతో లుంగాపుట్టు వద్ద బంకు నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన గిరిజనుడు సొంత స్థలాన్ని ఉచితంగా బంకు నిర్మాణానికి అందించడంతో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు పనులు మొదలైంది. ఎనిమిది నెలలోనే అన్ని హంగులు పూర్తి చేసుకొని బంకు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. నెలాఖరులోగా బంకు ప్రారంభం కానున్నట్టు అధికారులు తెలిపారు. బంకు అందుబాటులోకి వస్తే వాహనాలకు సుదూర దూరం వెళ్లి పెట్రోల్ వేసే కష్టాలు తొలగుతాయని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తయిన పనులు

లుంగాపుట్టు వద్ద పెట్రోల్ బంకు నిర్మాణ పనులు నూరుశాతం పూర్తయ్యాయి. త్వరలోనే పెట్రోల్ బంకు ప్రారంభం జరుగుతుంది. వాహనదారుల పెట్రోల్ కష్టాల దృష్ట్యా హెచ్‌పీసీఎల్ అధికారుల సహకారంతో వేగంగా నిర్మాణం పనులు చేయించాం. 18 కిలో మీటర్లు దూరంలో పెదబయలులో బంకు ఉండడంతో పెట్రోల్ కోసం వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు పడుతూ ఉండేవారు. బంకు అందుబాటులోకి వస్తే వాహనదారుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

– జబ్బార్, ఏఈఈ, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ, ముంచంగిపుట్టు మండలం

రహదారి పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీలు గంగరాజు, మత్స్యలింగం, సర్పంచ్ రూతు

అనంతగిరి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారుమూల గ్రామాలకు రహదారులకు మోక్షం కలిగిందని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ రాజుపాక నుంచి డెక్కపురం మీదుగా హుకుంపేట మండల బూర్జ పంచాయతీ పట్కుదవడ గ్రామానికి జాతీయ ఉపాధి హామీ పథకంలోని రూ.2.40 కోట్లతో నిర్మిస్తున్న రహదారి పనులకు, ఎంపీపీ శెట్టి నీలవేణి, అనంతగిరి, హుకుంపేట, జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు, రేగం మత్స్యలింగం, సర్పంచ్ రూతుతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ రహదారికి మోక్షం కలగడంతో గిరిజనుల ఆనందానికి అవధుల్లేవన్నారు. మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేస్తున్నారని, రహదారితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యులు గంగరాజు, మత్స్యలింగం మాట్లాడుతూ గతంలోని డెక్కపురం నుంచి పట్కుదవడ గ్రామానికి చేరుకుని, గిరిజనులు సమస్యలపై తెలుసుకున్నామన్నారు. రహదారి సమస్యను జెడ్పీ సమావేశంలో సైతం విన్నవించామన్నారు. రహదారికి మోక్షం కలగడంతో సంతోషంగా ఉందన్నారు. సర్పంచ్‌లు సింహాద్రి, మోస్య, కో–ఆప్షన్ సభ్యుడు మదీనా, కార్యదర్శి జోగారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంధ్య, నాయకులు నాగులు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

యువతతోనే దేశ భవిష్యత్



విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంఈవో సరస్వతిదేవి

పాడేరు రూరల్ : నేటి యువతతోనే దేశ భవిష్యత్ ముడిపడి ఉందని యువత ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఎంఈవో సీహెచ్.సరస్వతిదేవి అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో 162 పాఠశాలల్లో 215 మంది ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి తొమ్మిదో తరగతి చదువుతున్న 7591 మంది విద్యార్థులకు భాగస్వామ్యం చేశామని ఎంఈవో సరస్వతిదేవి చెప్పారు. జిల్లా సైన్సు కో–ఆర్డినేటర్ రామ్మూర్తి నాయుడు పిల్లల భవిష్యత్‌కు ఊతమిచ్చే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఎదగడం గొప్ప విషయమన్నారు. జిల్లాలో 139 పాఠశాలలు 403 ప్రాజెక్టులు చేయగా వాటిలో 10 ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ఎక్స్‌పో పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ నెల 28న విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటుందన్నారు. ఈఎండీపీ జిల్లా మేనేజర్ దిలిప్‌కుమార్, హెచ్ఎం కొమ్ము కృష్ణమూర్తి, మెంటర్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల అందజేత



లబ్ధిదారులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

వై.రామవరం: మండలంలోని చింతలపూడి పంచాయతీ బొడ్డగుంట గ్రామంలో 60 మంది గిరిజనులకు కుల ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మిల అధ్యక్షతన గురువారం మంజూరైన ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఆనందరావు మాట్లాడుతూ గ్రామసభ నిర్వహించి ఆన్‌లైన్ చేయించామన్నారు. విషయాన్ని రెవెన్యూ అధికారులకు తెలియచేయగా, విచారణ నిర్వహించి సకాలంలో ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారన్నారు. వాటిని తామే స్వయంగా సచివాలయంలో డౌన్‌లోడు చేయించి, గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. ధ్రువీకరణ పత్రాలు అందజేసి, సహాయ సహకారాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులకు బొడ్డగుంట గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ జడ్పీటీసీల తోపాటు వైస్ ఎంపీపీలు వలాల విశ్వమ్మ, ముర్ల జోగిరెడ్డి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్ సన్యాసమ్మ, మండల వైసీపీ నాయకులు కరణం కనకరాజు, మద్దికొండ బారతిబాబు, మడి బాబి, వైసీపీ గ్రామకమిటీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో ఉపాధి పనులు



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతయ్య

చింతపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లాలం సీతయ్య గురువారం వీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నిర్దేశించిన ఉపాధి పనుల లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్నవారికి 100 రోజుల పని కల్పించాలన్నారు. జాబ్‌కార్డులకు ఆధార్ నంబర్ అనుసంధానం చేయాలని సూచించారు. పనులు నిర్వాహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు పంపిణీ



విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు అందజేస్తున్న పట్నాసి ఫౌండేషన్ ప్రతినిధులు

అరకులోయ రూరల్: రవ్వలగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం స్థానిక పట్నాసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెన్నులు, స్టేషనరీ, ప్యాడ్లు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు పట్నాసి చలపతిరావు, పట్నాసి నారాయణ, పట్నాసి జగ్జీవన్‌రావుల ఆర్థిక సహాయంతో స్థానిక మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పాఠశాల హెచ్ఎం కెందు, చేతుల మీదుగా అందజేశారు. వారు మాట్లాడుతూ ఏటా పదో తరగతి విద్యార్థులకు స్టేషనరీ తదితర సామగ్రి అందజేస్తున్నట్టు చెప్పారు. భవిష్యత్తులో పేద విద్యార్థుల కోసం పట్నాసి ఫౌండేషన్ సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. నాగంనాయుడు, సోమేశ్వరరావు, భాస్కర్‌రావు, సుబ్బారావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పరిశీలన



టెన్త్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో తాతబ్బాయిదొర

రాజవొమ్మంగి: మండలంలో ఏర్పాటైన పది పరీక్షా కేంద్రాల్లోని ఏర్పాట్లను ఎంఈఓ తాతబ్బాయిదొర గురువారం పర్యవేక్షించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు రాజవొమ్మంగి ఉన్నత పాఠశాల కేంద్రంగా 160 మంది విద్యార్థులు, బాలుర ఆశ్రమోన్నత పాఠశాల కేంద్రంగా 130 మంది, జడ్డంగి ఆశ్రమోన్నత పాఠశాలలో 120 మంది, సింగంపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పది పరీక్షలకు మండలవ్యాప్తంగా గల పాఠశాలల నుంచి మొత్తం 478 మంది విద్యార్థులు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, సిబ్బంది

అరకులోయ రూరల్: మండల కేంద్రంలో భగత్‌సింగ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిజన సంఘం కార్యాలయాల్లో భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించి, అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. వారు వేరు వేరుగా మాట్లాడుతూ పోరాట యోధుల ఆశయాల అనుగుణంగా కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణ, సిబ్బంది విజయలక్ష్మి, నాగబాబు, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న వీఓఏలు, సీసీలు

గూడెంకొత్తవీధి: పాడేరులో వీఓఏ రమాదేవి, సీసీపై దాడికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం గూడెంకొత్తవీధిలో సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. సీఐటీయూ మండల కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా వీఓఏలు, సీసీలు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. వీఓఏల సంఘం అధ్యక్షుడు చంటి, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు చంటిబాబు, గాలికొండ ఎంపీటీసీ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి... (see above)

అవగాహనతోనే సమస్యల పరిష్కారం సాధ్యం



గ్రామ వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న గంగరాజు

అరకులోయ రూరల్: అవగాహనతోనే సమస్యల పరిష్కారం సాధ్యపడుతుందని రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు అన్నారు. స్థానిక ఏపి టూరిజం మయూరి రిసార్ట్స్‌లో ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం అల్లూరి జిల్లా పరిధిలో ఉన్న వివిధ మండలాల గ్రామ వలంటీర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతు ఎటువంటి సమస్యలు వచ్చిన వాటిని పరిష్కరించుకునేలా ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండలన్నారు. యువత అన్ని రంగాల్లో రాణించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ చైతన్యం కల్పిస్తుందన్నారు. విద్య, వైద్యం, హక్కులు చట్టాల విధి విధానాలపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు, రెడ్‌క్రాస్ జిల్లా కో–ర్డినేటర్ కోటేశ్వరరావు, డాక్టర్ ప్రసాద్, ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాజవొమ్మంగి: కరుదేవపాలెం గ్రామంలో జడ్డంగి పీహెచ్‌సీ వైద్యాధికారి యామినిప్రియ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా 50 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య వివరాలు సేకరించారు. 104 డాక్టర్ నాగార్జున, ఎంపీహెచ్ఓ లక్ష్మణరావు, ఏఎన్ఎం మల్లేశ్వరి, సిబ్బంది శ్రీనివాస్, కనకరాజు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పరిహారం అందజేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కూనవరం: తుపాను ప్రభావం వల్ల ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పంట నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కె.అనసూయకు గురువారం వినతిపత్రం అందజేశారు. వైఎస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ మండలంలో కురిసిన అకాల వర్షాలకు మిర్చి, లంక పొగాకు, మొక్కజొన్న తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, తద్వారా అనేక మంది రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రైతులకు పంట నష్టపరిహారం అందజేయాలని కోరారు. సీతారామయ్య, నాగేశ్వరరావు, కృష్ణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 11 మంది గైర్హాజరు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా గురువారం జరిగిన ఇంటర్మీడియట్ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ విజయమోహనరావు తెలిపారు. ఫస్ట్ ఇంటర్‌కు చెందిన జనరల్ పేపర్స్‌కు సంబంధించి 264 మంది హాజరు కావాల్సి ఉండగా, 255 మంది మాత్రమే పరీక్ష రాశారని, ఒకేషనల్ కోర్సులకు సంభందించి 15 మందికి 13 మాత్రమే హాజరైనట్టు తెలిపారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధులు

పాడేరు రూరల్/అరకులోయ రూరల్/ముంచంగిపుట్టు/కొయ్యూరు: జిల్లాలోని పాడేరు, అరకులోయ, ముంచంగిపుట్టు, కొయ్యూరు ప్రాంతాల్లో సేవ్ జర్నలిజం డే ను గురువారం నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే పిలుపుమేరకు వివిధ పత్రికలకు చెందిన జర్నలిస్టులు, నేతలు ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టులపై దాడులు ఆపాలని, జర్నలిస్టుల సంక్షేమ నిధిని ఏర్పాటుచేయాలని కోరుతూ పాడేరులో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సత్యనారాయణ, శివ, మహేష్ పాల్గొన్నారు. అరకులోయ, ముంచంగిపుట్టు, కొయ్యూరు ప్రాంతాల్లో తహసీల్దార్ వేణుగోపాల్, నర్సమ్మ తదితరులకు విలేకరులు వినతిపత్రం అందజేశారు. రవి, అనిల్, రామారావు, ప్రసాద్, రమణ, శ్రీను, డి.పద్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన లారీ... రాకపోకలకు అవస్థలు



నుర్మతి రోడ్డులో గుదలంవీధి మలుపు వద్ద రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీ

జి.మాడుగుల: మండలంలో నుర్మతి వెళ్లే మార్గంలో గుదలంవీధి గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద లోడ్‌తో ఉన్న లారీ అడ్డంగా నిలిచిపోయింది. దీంతో మద్దిగరువు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. మైదాన ప్రాంతం నుంచి మద్దిగరువు పరిసర ప్రాంతాలకు సిమ్మెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. సెల్ టవర్లకు సంబంధించి చేపడుతున్న పనుల్లో భాగంగా గోతులు తవ్వడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనచోదకులు చెబుతున్నారు. అధికారులు స్పందించి వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ



బొయితిలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది



జీకేవీధిలో విజేతలకు బహుమతులిస్తున్న డాక్టర్ సందీప్, హెచ్ఎం గణేశ్వరరావు

పెదబయలు: క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. గోమంగి పీహెచ్‌సీ పరిధిలోని బొయితిల వారపు సంతలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. బొయితిల నుంచి మద్దిగరువు ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని, రెండు వారాలు మించి దగ్గు ఉంటే కళ్లె పరీక్షలు చేసుకోవాలని సూచించారు. క్షయ నిర్మూలన అందరి బాధ్యత అన్నారు. ఎంపీహెచ్ఓ వెంకటేశ్వర్లు, హెచ్‌వి లక్ష్మీ, జననీ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: అవగాహనతోనే మహమ్మారి క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని సప్పర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సందీప్ అన్నారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో క్షయ వ్యాధి నివారణకు సంబంధించి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. హెచ్ఎం గణేశ్వరరావు, టీబీ సూపర్‌వైజర్ అశోక్, ఈవో సింహాచలం, ఏఎన్ఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

హుకుంపేట: మండల సర్వసభ్య సమావేశం 31న నిర్వహిస్తున్నట్టు ఎంపిడీవో వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశపు మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరవుతన్నట్టు తెలిపారు. మండలంలోని అభివృద్ధి పనులపై సమీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరు కావాలని పేర్కొన్నారు. సమావేశం ఆరోజు ఉదయం 10.30 ప్రారంభమవుతుందని, విధిగా హాజరు కావాలని కోరారు. మండల స్థాయి అధికారులు ఏ ఒక్కరు హాజరు కాకపోయిన వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రంపచోడవరం: ఏపీ వెలుగు యానిమేటర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు యానిమేటర్స్ సమస్యలు పరిష్కరించాలని రంపచోడవరం ఏపీడీ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వాణిశ్రీ,, నాయకులు, శాంతిరాజు, సిరిమల్లి రెడ్డిలు మాట్లాడుతూ వెలుగు యానిమేటర్ల అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. తొలగించిన యానిమేటర్లను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు.

రాజవొమ్మంగిలో భారీ వర్షం

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. రాజవొమ్మంగి–వట్టిగెడ్డ–సింగంపల్లి గ్రామాల మధ్య జరుగుతున్న జాతీయ రహదారి పనుల నిమిత్తం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. చిత్తడిగా మారడంతో వాహనాలు బురదలో చిక్కుకున్నాయి. రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్న సిబ్బంది పొక్లెయినర్ తదితర యంత్రాల సహాయంతో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. బురద వున్న చోట క్వారీ బూడిద పరిచి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.